అతని మనస్తత్వం అతనికే బోధపడదు. ఎందుకు అస్తమిస్తున్న సంధ్యకేసి అదే పనిగా చూడడం? ఎండిపోయి, ఆకులన్నీ రాలిపోయి, కేవలం కొమ్మలు మాత్రమే మిగిలిఉన్న చెట్ల అస్థిపంజరాలు చూస్తే ఎందుకలా నిలబడిపోవడం? రోజూ అతని కదో బాధ అయిపోయింది. ఎందుకో, అందులోనూ మరీ, ఆఫీసుముందుగా ఉండే పెద్ద చెట్టు మరీ నిలబెట్టేస్తున్నది. తోడి గుమాస్తాలు కూడా తనలాగా నడుస్తున్నారు. వాళ్ళందరి తోటే తనూ మొయ్యలేనంత కాగితాలకట్ట చేతపట్టుకుని – ఎదురుగుండా ఆ సమయానికే బయలుదేరబోయే రైలు కోసం వెళ్తున్న యిస్త్రీ బట్టల మనిషి పెన కౌతల, సామాను మోస్తూ వెళ్తున్న కూలీ కేసి ఏదో *Superiority Complex* తో చూసి...తనది మాత్రం *Manual Labour* కాదనుకుని సంతోషించే, సంతృప్తిపడే తన మిత్రులలాగా తనూ బతకగూడదూ. ఆఫీసు వదలి బయటికి వచ్చిన మరుక్షణంనుంచీ కూడా ఎవరికో యిచ్చిన ప్రమోషన్‌ను గురించో, తనకు యిచ్చిన *Censure* ని గురించో, ఆవేళ ఆఫీసు కాగితాల భేష జంలో తాను చేసిన మహత్కార్యాన్ని గురించో, కాకపోతే తన ఆఫీసరుపై లోపాయికారీగా వచ్చిన వివరాల అన్వేషణ గురించో మాట్లాడుకుంటూ – ఒకరు లేకుండా మరొకరిపై ఏవేవో మాటలు చెప్పుతూ – బహుశా రాత్రి కూడా అవే కలలు కని, కాగితాల కట్టలే పక్కలో పెట్టుకుని నిద్రపోయి బ్రతుకంతా గడిపేసే యితరు లందరిలాగే తనూ ఎందుకు బతక లేకపోతున్నాడు.

అసలు యీ చిక్కు అంతా తను కొత్తగా కాలేజీలోంచి విడుదల కావడం వల్ల వచ్చిందనీ చాలా త్వరలో యీ అసందర్భపు,అవకతవక, అక్కరలేని ఊహలన్నీ పూర్తిగా పోతాయనీ పూర్తిగా, ఆ కాగితాల మధ్య కూర్చొని అందులోనే సజీవ సమాధి అయిపోవడం కేవలం నిజమనీ ఒక చాలా అనుభవస్థుడు చెప్పాడు. కాని – ఆ సమయం ఎన్నటికి వస్తుందో కాని, అంత వరకూ క్షణం ఒక యుగంలా ఉంది.

రోజూ పదకొండో గంటకల్లా, ఆఫీసుకు పోవడం, సాయంకాలం-పాపం,సూర్యుడు చాలా అలసిపోయి దూరంగా కలెక్టరు బంగాళా వెనకా తల బరువుగా అస్తమిస్తూం టాడు. వంతెన క్రింద, పారుతున్న ఒకటి రెండు చిన్న పాయల్లోనూ చాకలాళ్ళు బట్టలు ఉతికి, యిసకమీద ఆరేసిఉంటారు. అప్పటికే ఎర్రబడిపోయిన సూర్యకాంతి పూర్తిగా నేలవాలుగా పడుతూంటుంది. ఆరేసిన అనేకరంగుల చీరలమీదపడ్డ ఒకే రంగు కాంతి వాటికి మరో విచిత్రమైన రంగులు యిచ్చి, కాస్సేపు అనేక రంగుల కాంతులు యిసకమీద *Focus* చేసినట్లు కనిపిస్తుంది. ఒకక్షణం పోయాకగాని తెలియదు, అవి కేవలం రంగుల చీరలనీ, యిసకమీద ఎండేశారనీ. రోడ్డుమలుపు తిరిగేసరికి చీకటి పడిపోతూంటుంది. అస్తమిస్తున్న రంగు బింబం ఎదురుగా – ఆకులన్నీ రాలిపోయినా చెట్టొకటే – నలగా, ప్రతికొమ్మ, ప్రతి వంపూ, ఎంతో స్పష్టంగా, సన్నగా ఉన్న సిమెంటురోడ్డువేపుకి వంగి, కన్పిస్తుంది. ఏమిటో ఆ కొమ్మల్లో విశేషం. ప్రతి కొమ్మా, ఏమీ దాచుకోకుండా బయటపెట్టుకుని నిలబడ్డ చెట్టు, ఎంత నిష్కపటంగా కనపడుతుంది!

సూర్యుడు పూర్తిగా అస్తమించేసి, అలుముకుంటున్న చీకటి ఆ చెట్టుకొమ్మలంత నల్లబడిపోయి, ఆకాశం, చెట్టూ, విస్తీర్ణ దీయరానంత సన్నిహితంగా కలిసిపోయే దాకా అక్కడే నిలబడి చూడాలనుకునే వాడు...కాని తోటి గుమాస్తాలు చూడనివ్వరుగా! ఆఫీసుముందు చెట్టు, యింతకన్నా అందమయినది. అవకాశం ఉన్నప్పుడల్లా దానికేసి చూసేవాడు. అదృష్టవశాత్తూ తన కిటికీలోంచి ఎంతో బాగా కనపడుతుంది చెట్టు – అన్నిరకాల కాంతుల్లోనూ, ఎన్నో విధాల కోణాల్లో ఆ చెట్టును చూశాడు. యీ చెట్టునుకూడా అల్లా చూడాలి. ఎప్పుడో.

వాళ్ళు రోజూ అనుకునేవాళ్ళు – ఇతను పిచ్చివాడు; – కాకపోయినా అలాటివాడు– అని. లేకపోతే ఎండిపోయిన చెట్లు అందంగా ఉండట మేమిటి? చాకలివాళ్లు ఆరేసిన చీరల్లో ఏవో దృశ్యాలు ఊహించుకోవడ మేమిటి? అస్తమిస్తున్న సూర్యుడి కాంతిలో అందమైన రంగులు కనిపించడ మేమిటి?

యితను కేవలం పిచ్చివాడయిపోతున్నాడని రఘునాథం చెప్పాడు. ఎవరూ సాహసించి అలా చెప్పలేదు. అన్ని లౌకికవ్యవహారాల్లోనూ అతను చాలా తెలివయినవాడే – యీ చెట్లనీ, యీ సంధ్యలనీ చూస్తేనే వస్తుంది యీ పేచీ అంతా. ఆ సంగతి రఘునాథానికేం తెలుసు? రఘునాథానికి ఒక తమ్ముడుండేవాడనీ, అతనూ యిలాగే చెట్లకొమ్మల వంపుల్నీ, చందమామ వెలుగుల్నీ – నదులమీద నురగనీ, చూసి చూసి తనకి తెలియకుండా ఓ చెట్టుకేసి చూస్తూ, కారు కిందపడి – చచ్చిపోయాడట. అతనుకూడా అల్లా అయ్యే ప్రమాదం ఉందనీ, అలాంటిపని ఎప్పుడూ చెయ్యవద్దనీ రఘునాథం అన్నాడు.

పాపం, ఆరఘునాథం చాలా మంచివాడు. తను తినే హోటల్లో సర్వరు. అతనితో రోజులో కొంత భాగం, చాలా సంతోషంగా గడుస్తుంది. నిజాన్ని చాలా దిగంబరంగా చెప్పగలడతను. అతనితో అలా మాట్లాడడం, అతనితో కలిసి సినిమాకి వెళ్ళడం, ఎందుకో నచ్చదు చాలా మందికి.

ఏం? అతనితో బెంచీ టిక్కెట్టుకి వెళ్తే తప్పా! అతని కంతకన్నా కొనే తాహతు లేదు. తనకీ లేదు! కానీ, ఒకటే తేడాట! ఆమాటా అనుభవస్థుడు చెప్పాడు. గుమాస్తా తనకి తాహతులేదని చెప్పడట – సర్వరు చెప్పేస్తాడట సర్వరు చిరిగిపోయిన

చొక్కా బహిరంగంగా తొడుక్కుంటే- గుమాస్తా, అలాంటి చొక్కాపై ఒక కోటు తొడుక్కుని కూచుంటాడట! - యీ విచిత్రజీవన వేదాంతపు పరమార్థం అతనికి బోధపడలేదు. అసలు దానికోసం అతనాట్టే ఆలోచన వృథాచేయలేదు. బెంచీ టిక్కెట్టుకి వెళ్ళడం, ఆఫీసు గుమాస్తా హోదాకి తక్కువట. కాని ఏం చెయ్యాలి. డబ్బెట్టుకి 1-4-0 కి వెళ్ళలేదు. ఆఫీసు పేరు ఉపయోగించుకుని ఊరికినే పరుపుల సోఫాలమీద కూర్చోవడం అతనికింకా అలవాటుకాలేదు.

ఒక సహోద్యోగి ఓసారి తనతో తీసుకుపోయాడు. గేటు దగ్గర ఆఫీసు పేరు చెప్పి, లోపల కూర్చోపెట్టుకున్నాడు, తనపక్క. కాని ఆ మూడు గంటలూ ఏదో మహాపాపం చేసినవాడిలా *Feel* అయ్యాడు. తనవాడు మాత్రం, ఎంతో దర్పంతో, ఏదో సాధించినవాడిలా ***Pose*** పెట్టి, బయటికివస్తూ నవ్వాడు తనకేసి చూసి. అతని కేమనాలో అర్థంకాలేదు. ఏమిటీ జీవితం. ఆఫీసులో అధికారి ముందు జవానుకన్నా కనిష్టంగా తలవంచవలసిన వ్యక్తి, మరోచోట, యింత దర్జాగా ప్రవర్తించడానికి ఎంత మార్పు కావాలి? వీళ్లు ఎంత గొప్పవాళ్ళు?(!) ఎప్పటి కప్పుడే మరచిపోగలరు. క్షణం క్షణం మరో జన్మ ఎత్తినంత పని చెయ్యగలరు.

మరి తనో- ఒరోజున ఆ అధికారి అన్నమాటలకు మతి పూర్తిగా చెడిపోయినంత పని అయి- అస్థిపంజరం వణికి, జీవితమంతా శిథిలమైపోయినంత యాతనపడి - ఒకడిచేత మాట అనిపించుకున్నానే అని, మొహం, మనస్సూ ఎఱ్ఱబారిపోయి, తనలో కొన్ని వేల భూకంపాలు జరిగిపోయి, కొన్ని రోజులదాకా, ఆ మాటే మళ్ళీమళ్ళీ స్ఫురణకి వచ్చి, యింకే పని చెయ్యబోయినా, ఎవరితో మాట్లాడబోయినా, అదే సంఘటన జ్ఞాపకానికి వచ్చి, ఎంత కుమిలిపోయాడు! చివరికి యింటికి వచ్చి ఎవరూ చూడకుండా ఎక్కెక్కి ఏడిచాడు; ఆ బాధోపశమనానికి. ఎంతోమంది ఆంతరంగిక మిత్రులకి ఉత్తరాలు రాశాడు ఆ విషయం వెళ్లబోసుకుంటూ. మనిషై పుట్టించినందుకు, మనస్సు తన కిచ్చినందుకు దేవుడిమీద ఎంత కోపం వచ్చింది. మళ్ళా నేటికీ ఆ విషయం గుర్తుకి వచ్చి తనలో తనకే నమ్మకంపోయి కృంగిపోతూంటాడు. అలాంటిది తన స్నేహితుడెంత గట్టిమనిషి. బహుశా బతకగల మనిషి లక్షణం యిదే కాబోలు.

సినిమా అయిపోయిన తరువాత యిద్దరూ బయటికి వచ్చేస్తున్నారు. దారిలో ప్రొప్ర



"ఇది ఎండిపోయిందని ఎవరు చెప్పారు? వసంతంరానీ, మళ్లా హాయిగా చిగురిస్తుంది."

యిటరు అడిగారు "ఏమండీ, ఏమయిందండీ మా పని" అని. "అయిపోయిందండీ - తరవాత మాట్లాడతాగా" అన్నాడు నా ప్రక్కాయన. ప్రొప్రయిటరు ఊరుకున్నాడు. కొంచెందూరం పోనిచ్చి తన ప్రక్కవాడన్నాడు గదా—"వాళ్ళకి బోలెడు పనులు మనతో ఉంటాయి. ఆమాత్రం గౌరవం యివ్వడూ" అని. తన కెందుకో జీర్ణం కాలేదు ఆ మాటల్లో భావం. ఆఫీసులో ఏ అధికారీ తన కిందవాడిని మనిషిలా చూడడు. అదే సమయంలో తనకన్నా పైవాడికి మాత్రం 'అడియేన్ దాసోహ' మంటాడు చేతులు నలుపుతూ. యీ మనిషి తన అధికారిచేత మనిషిలా చూడబడటం లేదు. అలాంటప్పుడు దూరంగా ఉన్న ఎవరో తనకు చూపించిన

# చెట్టు

‘అవసరార్థపు’ గౌరవాన్ని; చూసుకుని తనో ఆరంగుళాల పొడుగు ఎదిగినట్లు ఆయన ఎందుకు భావించుకుంటున్నాడో బోధ పడడంలేదు. ఆఫీసులో తన కివ్వబడే స్థానం ఆ సమయంలో మరచిపోగలడు ఆయన. అవును, లేకపోతే తన లాగా ప్రతిదానికీ వాళ్ళూ మగ్గిపోతే యీపాటికి పిచ్చివాళ్లయిపోదురు. కొంపదీసి తనకీ పిచ్చెక్కదు గద.

యింటి కొస్తున్నాడు...దారిలో ఆకులు రాలిపోయిన చెట్టు నవ్వుతూ పలకరించింది. యీ కోణంలోంచి చూస్తే మరో రకంగా కనపడుతుంది ఆ చెట్టు - దానిపక్కనే వెలిగే చిన్న దీపపుకాంతి కొన్ని కొమ్మల మీద ఒకప్రక్క పడి, బంగారపు చెట్టులా కనపడుతోంది. దానికేసే చూస్తూ నడుస్తాడు. అల్లా నిలబడిపోయి చూడ్డం యీ మధ్య బలవంతాన మానుకోవలసివస్తోంది. అందరూ నవ్వుతారు. దానికి ఎదురుగా ఉన్న యింటిగోడ నీడలో ఎవరికీ కనపడకుండా నిలబడి ఆ చెట్టుకేసి చూడాలని ఎన్నాళ్ళనించో సంకల్పం. ఏదీ తీరిక ఉంటేగా! ఎప్పుడూ ఆఫీసే. ఎప్పుడూ కాగితాలే. పోనీ, దేవుడి ధర్మమా అని ఆ చెట్టు రోడ్డు పక్కనే ఉంది. దానికోసం పని కట్టుకుపోవాల్సినంత దూరంలో ఉండకుండా.

ఆ మర్నాడూ, ఆఫీసుకు పోయాడు. దారిలో చెట్టు ఎందుకో తల వంచుకున్నట్టుంది.

కారుల దుమ్ము ఆ చెట్టుచుట్టూ పట్టి దానిని సరిగా కనపడనీయడంలేదు. ఆఫీసు టైము అయిపోతోంది. గబగబా నడిచాడు. ఆఫీసుకి వచ్చేశాడు. టైము పదకొండయింది సరిగ్గా. ఆఫీసుముందు చెట్టుచుట్టూ ఎవరో పదిమంది మనుషు లున్నారు. వాళ్ళేదో కొల్చుకుంటున్నారు. ఏమిటో అతని కర్థం కాలేదు. ఆలోచించడానికి వ్యవధిలేదు. గబగబా మేడమీదికిపోయి సంతకం పెట్టాడు. అక్కడినుంచి చూస్తే చెట్టుకొమ్మలు ఎంత దర్జాగా ఉంటాయి. ప్రతి కొమ్మ చివరా ఎన్ని చిన్న పలవలు! వాటిలో ఎన్ని వంపులు? ఎన్ని మలుపులు? వాటి ప్రతి అంగుళం అతి జాగ్రత్తగా తయారుచేశారు- ఎవరో అజ్ఞాతశిల్పి. ఒక పక్కనుంచి వెలుగు పడుతూంటే వెండిలాగా మెరిసిపోతోంది చెట్టు. కొమ్మలు గాలికి ఊగి నవ్వుకుంటున్నాయి; ఒకటెని చూచి మరొకటి. ఎన్నో సార్లు అనిపించింది- ఆ చెట్టు బొమ్మ వేసుకోవాలని. కాని అమ్మో - ఆఫీసులో ఎవరేనా చూస్తే ప్రమాదమట. ఆ అనుభవజ్ఞుడు చెప్పాడు. ఏం ప్రమాదమో, ఎందుకు ప్రమాదమో అడుగుదా మనుకున్నాడు గాని అడగలేదు. అయినా యిప్పుడు వేసుకుంటే బాగుణ్ను. యీ వేళ వాళ్లి *Section Head* శెలవు అందుకని కొంచం తీరికగా చెయ్యవచ్చుపని.

“ఏమిటోయ్! తదేకంగా ఆలోచిస్తున్నావ్” - అదిరిపడి చూచాడు ఆగొంతుక విని. శర్మ- నవ్వుతూ వెనకాల నిలబడ్డాడు. అ ప్రయత్నంగా - అన్నాడు. ‘చెట్టు’ అని...“ఆ! చెట్టు...అమ్మేశాం, కొట్టుకోడానికి వచ్చారు వాళ్లంతా.” అన్నాడు శర్మ. వళ్లు జలదరించింది అతనికి. “ఏం అంత అందమయిన చెట్టు కొట్టెయ్యడమేమిటి? అక్కడుంటే ఏం ప్రమాదం,” అన్నాడు అతను. “ప్రమాదం కాదయ్యా, యిది ప్రభుత్వం వారి వన మహోత్సవంలో ఒక భాగం.” అన్నాడు రాజగోపాలం. యీవిట్కి నవ్వడానికి తగిన స్థితిలో లేడు అతను.

“ఎందుకు కొట్టించడం? - అక్కడున్న అమాయికపు అందమయిన చెట్టును?” శర్మకి నవ్వొచ్చింది.

“ఏమిటీ కవిత్వం, ఆఫీసుకు ఎదురుగుండా ఎండిపోయిన చెట్టు అందమయినదంటావేమిటి? నువ్వు ప్రస్తుతం ఏ లోకంలో ఉన్నావు? ఇది పగలా రాత్రా?- యిదిగో యిటు చూడు - యీ చేతికి ఎన్ని వేళ్ళున్నాయి?” ఉక్కిరి బిక్కిరయ్యేలా ప్రశ్నలు కురిపించాడు శర్మ. “పిచ్చివాడా యింకెక్కడా యిలా మాట్లాడకు. ఆఫీసు ముందు ఆ భాగంలో *Record Room* కట్టాలి. అక్కడ యీ చెట్టుండడం అడ్డం కాదూ. అంచేత కొట్టెయ్యక తప్పలేదు. పైగా ఎండిపోయిన చెట్టయ్యె. దానివల్ల నీడలేదు. యింక ఏమిటి ప్రయోజనం.

“ఒరే! అస్తమానం కళ్లు మూసుకుని అద్దం ముందు నిలుచుంటావేంరా?”

“ఆఁ! ఏం లేదు! నిద్ర పోతున్న పోజులో నేను ఎల్లా వుంటానోనని!”

—శ్రీ మండలీక విశ్వేశ్వరరావు,
మద్రాసు.

అమ్మేస్తే, కొట్టుకున్న వాళ్ళు స్వంత ఖర్చుమీద కొట్టుకుని తోలుకుపోతారు. అని నోట్ పెట్టాను. తత్ఫలితంగా నిన్న ఆదివారం వేలంలో అమ్మేశాం. యీ వేళ కొట్టుకుపోతారు. చవగ్గానే పోయిందిలే. పాతిక రూపాయిలు. దీనికోసం అందమయిన చెట్టనీ, అమాయకపు చెట్టనీ - అంటావేమిటి - యీ ఎండు మోడుని?

“నీకూ, ఆ ఆర్డరు వేసినవాళ్లకీ మతిలేదు. యిది ఎండిపోయిందని ఎవరు చెప్పారు? ఆకులు రాల్చేసింది. వసంతంరానీ, మళ్లా హాయిగా చిగురిస్తుంది. గుబురుగా పెరుగుతుంది. చక్కగా నవ్వుతుంది. గాలికి నాట్యంచేస్తుంది. అందాన్ని దారుణంగా హత్యచేస్తున్నారు.

అతని కళ్ళంబట నీళ్లు వచ్చేస్తున్నాయి. యింకే చెట్టును చూసి కదలకుండా నిలబడిపోవడం? రోడ్డుపక్క చెట్టును చూస్తూ నిలబడితే జనం ఊరుకోరు. అదిమాత్రం యిలాగే కొట్టెయ్యరని నమ్మకమేమిటి? దానిపక్క యింకా చాలా చెట్లుండేవిట యిళ్లు కట్టుకు నేప్పుడు కొట్టేశారట. యిదొక్కటే మిగిలిందిట. పాపం ఎంత కాలంనుంచీ యీ చెట్టు యిలా ఓపిగ్గా నిలబడి ఉందో. ఎన్ని వందల రకాల జనాన్ని చూసిందో. తనముందు ఆఫీసు కడుతూంటే అమాయికపు చెట్టు ఎంత సంతోషించిందో. ఎన్నిరకాల ఉదయాస్తమయాలు కళ్లారా చూసిందో; తదేకంగా. పాపం ఎన్నిసార్లు సూర్యచంద్ర కాంతుల్లో కరగిపోయిందో. ఎంతమంది అధికార్లని చూసిందో. యీ వేళతో దీనిదీర్ఘ జీవితం సరి...యింకే చెట్టు దాక్కున్న అందాలు వెతుక్కోవాలితను? దీని స్థానంలో కొద్ది రోజుల్లో నిర్జీవమైన రాతి భవనం నిలబడుతుంది. యిది ఎండిపోయిందని అనడం కేవలం ఒక కారణం మాత్రమే. ఏం ఆ భవనం యింకో చోట కట్టకూడదూ. అందం దారుణంగా హత్య చేయబడుతోంది.

(56 వ పేజీ చూడండి)

రత్నప్రరుషవేష్టం

సువర్ణము. శ్యాష్టియములు కలిపి తయారుచేయబడినది. శుక్లనష్టము. గుండెదడ. నరముల బలహీనము అతిమూత్రము మొ॥ మేహ వ్యాధులను హరించును. బలమును. కాంతిని. ధాతుపుష్టిని. యిచ్చును. అనేక యోగ్యతా పత్రాలు కలవు. డబ్బా రు. 3-12-0 వి. పి. రు. 1-0-0.

ఇండియన్ మెడిసన్ హౌస్,
లక్ష్మీటాకీసు రోడ్డు - విజయవాడ-2.

## ★ చెట్టు ★

(22 వ పేజీ తరువాయి)

గబగబా మెట్లు దిగాడు. అమాంతం చెట్టుని కౌగిలించుకోవాలనిపించింది. కాని తను మనిషి ఆకారంలో ఉన్న విషయం గుర్తుకొచ్చింది... యీ ఆకారంలో ఏ పనీ స్వేచ్ఛగా చేయడానికి వీలులేదు.

తిన్నగా పోయి తన బల్లముందు కూర్చున్నాడు. కాగితాలు బరువుగా పడి ఉన్నాయి. పై కట్టతో ప్రారంభించాడు. చెట్టుమీద మొదటి గొడ్డలి దెబ్బ పడింది. గుండెమీద తగిలినట్లనిపించింది. ప్రతి దెబ్బా, తనకే తగులుతోంది. మనస్సు కొంకర్లు పోతోంది.

చేతిలో కలం ఆడుతోంది. ఏం రాస్తున్నాడో తెలియదు. చెట్టుమీద దెబ్బలు పడుతున్నాయి గబగబా. దాని కేసి చూడ్డానికి కూడా భయం వేసి తలవంచుకు రాసేసుకుంటున్నాడు. చెట్టు పడిపోతుందేమో, ఓసారి అటు చూస్తే... అమ్మో! యింకేమన్నా ఉందా. పోనీ ఆఖరిసారి పడిపోకముందు...

"ఏమయ్యా! ఆ కాగితం అయిందా" గుమ్మాస్తాకి వినపడింది గొంతుక. పై అధికారి పై అధికారిది ఆ గొంతుక. యివేళ తనపై అధికారి శలవు. అందుకుని కేవలం పెద్ద దొరగారే స్వయంగా అడుగుతున్నారు.

చేతిలో ఉన్న కాగితం, సరిగా చూసుకోడానికేనా వ్యవధిలేదు. పంపేశాడు పైకి. చెట్టుపడిపోతుంది కాబోలు కాసేపటిలో... పాపం! చెట్టుకి మాటలు కూడా రావు. ఎవరేనా ఒక దేవుడు, ఒక మహా శక్తి, ఆ చెట్టుని పడకుండా ఆపకూడదూ! ఏదైనా జరగకూడదూ. అప్పుడు వాళ్ళంతా గొడ్డళ్ళు కిందపడేసి, అయ్యో యీ చెట్టు పడదండీ, యిదేదో మహాశక్తి - అని చెప్పేస్తే - దొరగారు విస్తుపోయి చేసేదేమీలేక ఊరుకోవాల్సిందేగా అప్పుడెంత బాగుంటుంది... యిదంతా భ్రమ - పగటికల... యీ చెట్టుపడిపోతుంది. తప్పదు. "బాబూ! అయ్యగారు రమ్మంటున్నారండీ తపుర్ని - "ప్యూన్ వచ్చి చెప్పాడు. వాడి అయ్యగారంటే పెద్దదొరగారే! ఎందుకు పిల్చారో! వెళ్లాడతను.

ఏమిటయ్యా! యీ రాత, నువ్వు ఏ ప్రపంచంలో ఉన్నావ్. ఏమిటీ రాత. వళ్లు పొగరెక్కి - ఉగ్రుడయిపోయాడు అధికారి. గడగడ వణకిపోయాడు తను. ఆ కాగితం తీసుకుని చూశాడు...

"అందాన్ని దారుణంగా హత్య చేసేస్తున్నారు. పచ్చగా బతికే చెట్టుని ప్రకృతితో పరిచయంలేని పరమమూర్ఖులు, పుస్తకాలు తప్ప ప్రపంచం ఎరగని పెద్దమ్మలు - కొట్టేస్తున్నారు." ముచ్చెమటలు పోసేశాయి అతనికి. తనకి తెలియకుండా నే రాసేశాడీ మాటలు, ఆఫీసు నోటు రాద్దామనుకుంటూ. బుర్ర పనిచెయ్యడంలేదతనికి.

"ఊఁ. ఇందాకొ వచ్చిందన్నమాట... నిన్నగాక మొన్న వచ్చి, నీపై అధికారులు మూర్ఖులు - నువ్వు మహాజ్ఞానివి... యింక చాలు నీ ఉద్యోగం......దయ చెయ్యి." కాగితం తీసుకొని బల్లమీద గట్టిగా పడేసి - దర్జాగా వెళ్ళిపోయాడు అధికారి.

అతని కర్థం కాలేదు...ఏ నే స్థితిలో ఉన్నదీ. అప్రయత్నంగా నే బయటికి వచ్చేశాడు. చెట్టు కొట్టడం పూర్తి అయింది... పెద్దశబ్దం చేసుకుంటూ దభీమని పడిపోయింది - వేళ్ళతో సహా - ఆ 'అందమయిన' వృక్షరాజం. ★

## ★ ముచ్చటగా ముగ్గురు ★

(31 వ పేజీ తరువాయి)

అటూ యిటూ తిరగటంలో హారిస్సుగాడు పొరపాటున జార్జిగాడి మడిమెలమీది ఒరిపిడి కాయలని తొక్కేశాడు. ఈపనే భోజనాత్పూర్వం జరిగివుంటే, నిజంగా ఆజార్జిగాడు తారామండలానికి ఎగిరేవాడే. ఇంత తప్పుడు పని చేసినందుకు హారిస్సుగాడికి యీలోకంలోనూ పైలోకంలోనూ కూడా పుట్టగతులు లేకుండా చేస్తానని శపథం పెట్టేసేవాడు. ఇంకా ఏమేమి చేసివుండేవాడో వూహించుకొంటే నే, నాలాంటి సున్నితమైన మనస్సుగల మనిషికి చలిజర్వం వచ్చేస్తుంది.

అటువంటిది, వూరికే "జాగ్రత్తరా అబ్బాయి; గోధుమపిండిడబ్బా తన్నెయ్యగలవు!" అని ఒక్క చిరునవ్వు నవ్వి వూరుకొన్నాడు.

హారిస్సుమాత్రం ఏం తక్కువ తిన్నాడు? కడుపు ఖాళీగావున్నప్పుడు జార్జిగాడు అలాంటి దురుసు మాటలు మాట్లాడితే గుక్క తిప్పుకోవటానికి వీలు లేకుండా వీడూ ఛడామడా నాలుగూ పెట్టేవాడే. గడ వాసంఅంతపొడుగున కాళ్లు పెట్టుకొని దారికి అడ్డంగా కూర్చుంటే జార్జిగాడికి చుట్టుపట్ల పదిగజాల దూరంలో ఎవరు కదలాలన్నా వీడి మడిమెలు తొక్కక తప్పదనే వాడే. అలాంటిది—వీడికీ కడుపునిండి మనస్సు వుల్లాసంగా వుందేమో — "చ్...చ్...చ్...! నీ మడిమె తొక్కేసినట్లున్నారా బ్రదర్? నొప్పి ఏమైనా వేస్తోందో" అని యెంతో ఆప్యాయంగా అడిగాడు.

జార్జి తనకేమీ నొప్పి పుట్టలేదని అంటూ అసలు అలా కాళ్లు బారజాపుకు కూర్చోవటం తనదే తప్పు అన్నాడు. జార్జిగాడు కాలుజాపుకు కూర్చుంటే మటుకు తను కళ్లు తెరుచుకు నడవ వలసిందని హారిస్సు తెగ నొచ్చుకొన్నాడు. 'తప్పంతా నాదే' నంటే 'తప్పంతా నాదే' నని యిద్దరూ కాసేపు ఒకరినొకరు మన్నన చేసుకొన్నారు.

వాళ్ల ఆధోరణి వినటానికి చాలా చమత్కారంగా వుంది.

(ఇంకావుంది)